# మొనాసుగొత్తి

*వలలో చిక్కిన పిట్టనుచూచి కనికరించడు వేట కాడు. లేచినవేళ మంచిదనుకొంటాడు; ఆనందిస్తాడు. ఒకవేళ కనికరం చూపినట్లు నటించినా లాభం ఉండదు.*

కందుల రామభద్రరావు

"అబ్బ! రేతిరి నీవు వస్తావని చూసి చూసి కళ్ళు కాయలు కాసినాయి" అన్నది అపర చెంచు లక్ష్మివంటి మూగదొరల పిల్ల—సొంబారి.

"మొనాసుగొత్తి, మైజిబుత్తి. ఆ ముతా నాయుడు కనికారము లేకుండా రాతిరి నన్ను దాన్నిము గుడ్డెకు కాపు పంపేడు" అన్నాడు గొడ్లను గెడ్డకు నీళ్ళకోసం దింపుతూ పండు దొర.

పాపము పండుదొర తనవద్ద డబ్బు లేకను ముతానాయుడు దయానిధివద్ద రెండువందలు పుచ్చుకుని, సొంబారి తల్లి తండ్రులకు కన్నెరికం 100 రూపాయులు, ఐదు కుంచాలు బియ్యం, మూడు కుండీలు మడ్డి, కొత్త కోక, ఒక మేక పోతు, గాజులు, పూసలు అన్నీ పెద్దల సమక్షంలో చెల్లించి పిల్లను తన హక్కు భార్యగా పొందాడు.

కాని ఆ కొత్త దంపతుల స్వేచ్ఛకు భర్త ముతా నాయుడువద్ద వాడిన డబ్బుకు గొత్తె



రకం ఉండడంచేత ఆటంకం కలుగుతున్నది.

"మామా! ఈ ఏడు పాతిక రూపాయలు తీర్మానం అవ్వుద్ది. మిగత డబ్బు రైలు రోడ్డు కూలికి ఎల్లి నేను తీరుస్తాను. నువ్వు నాయుడు దగ్గర గొత్తి వదిలెయ్యి.మనకు ఉంటేతింటాము, లేకపోతే లేదు. కొండనిండా బోలెడు దుంపలు. ఓ పీటుకంద, పిత్తకంద, ఒయిము కంద, తరగాయి కంద తవ్వుకుని పొట్ట నింపుకుందాము. ఏ కాలానికి ఆ కాలం మామిడిపళ్ళు ఏరు కుందాము. దాని టెంకలు ఎండబెట్టి జీడి ఊర బెట్టి అంబలి,రొట్టె కాల్చుకుందాము.—అప్పట్ను గొడ్లు గట్టుకి నేను ఎక్కిస్తాను కాని టెంక పిండి రొట్టె ముంచుకు తింటానికి అడుగో ఆ నంపంగి తొర్రలో తేనె తీసిపెట్టవూ?" అన్నది బుంగమూతిపెట్టి అతని వక్షముమీద బుర్ర ఆన్చి సొంబారి.

"సరేకాని, మేకపిల్లలు ఉన్నయ్యి జాగర్త! ముసురుకి నకిటెగాటిలోని సిందుకు వచ్చి, పైన ఉన్న గుల్లరాయి సాలలో మకాం వేసింది. నిన్న ఆ నంపగుడ బారికోడు మెండ (గొర్రె) లగేసు కెల్లింది. సరసు గొడ్డలి చేతిలోపెట్టి ఉండు. ఒకవేళ నీమీద కూడ పడవచ్చు" అని పండు దొర చెట్టు ఎక్కటము మొదలుపెట్టాడు.

"ఆఁ! ఆపాటిదాన్ని జడుస్తానా మామా! నేను కూడా అయినింటలో పుట్టేను. చిటిముగ విన్నిమెంటుమీద పితూరి జరిగినప్పుడు గంటం దొర, మల్లు దొరలకు మా తాత గాసిదొర కుడి బుజంగా ఉండి తుపాకితోటి ఆరుగురు ఎర్ర దొరలను కాల్చేడు. కూస్తే కాస్తే నాకు కూడా బాణంతో కోలవదలటం తెలుసు. ఏదన్న వస్తే కాలు ఖరక్కొట్టి పెడతాను."

తెచ్చిన తేనె అడ్డాకుల దొన్నికుట్టి అందులో పిండి, మిగిలిన తేనెతెట్టలు తింటూ "మామా, నాయిరాలు చెప్పగానే గొడ్డలి బుజాన్నేసుకుని కర్రలు తెస్తావు. ముసురు చూస్తే వదలదు. ఈదర గాలి ఎక్కువ. అసలే మనం ఉన్నది పసువుల సాలగది. పైన మిద్దిలేదు. చలి చూస్తే ఎముకలు కొరికేస్తుంది. కప్పుకుంటాన్కి గొంగలి లేదు. పోసి ఇంకో చీరబట్ట ఉంటే అదైనా కప్పుకుందును. అదీ లేదు. నగిడి కాలుద్దామంటే మన ఇంటికి నువ్వు కర్రలు తేవు. ఎప్పుడూ ఆ పాడుముండా ముఠానాయిడు పనే. నేను ఒంటరిగా ఆ గదిలో ఉండలేను. నీతోటి దాన్నేం కాపుకు వస్తాను" అన్నది సొంబారి.

"అయ్యో! ఎర్రిగుంటా! నీకు పెపెంచం ఇంకా తెలీదు. అక్కడ నేను ఒక్కణ్ణే కాదు. నాయుడు చిన్న కొడుకు ఎరికన్న, అల్లుడు సీతా రాము కూడా వస్తున్నారు. ఆళ్ళని వదలి నువ్వు, నేను గుడిశెలో గుడ్డె కాపు మానేసి, కాపరం చేస్తామంటే ఊరుకుంటారా? ఆళ్ళు అసలే కొమ్ములు ముదిరిన ముఠా నాయిళ్ళు. గొత్తి అంటేనే బానిసతనం. గొత్తి కుదరకపోతే నాకు డబ్బు దొరకదు. డబ్బు లేపోతే నిన్ను నేను పొందను. ఏదో కొంతకాలం ఇలాగ గడుపుదాము.

# మొనసుగొత్తి...

మనకి కూడా మంచిరోజులు రాకపోవు. గురువు గాడు పండుగల్లో చదువుతున్న రామాయణం లోని అర్థం నువ్వు ఆలకించటం లేదా? దేవు డంత రాముడే సీతామ్మోరుని వదిలి ఉండలేదా? దేముణ్ణి నమ్మినోళ్ళకి ఎక్కువ కష్టాలొస్తా యుట. కాని అన్నిటికి ఓరిసి నువ్వే ఉన్నావురా సామీ అంటే, సంకురుమణం నెలలో మంచు అంబలి పెలికి వక్కసారిగా వదిలేసి ఎండ ఎలాగ వస్తాదో అలాగే సుఖాలు దొరుకుతాయుట. అసలే ఇది కలికాలమని మా వూరిలోని పండా బాబ నయ్య చెప్పేడు. మన తాతలు తండ్రుల కాలంలో ఇంత గోరకలి లేదంట. మాయా రథాలు ఆకాసంలో ఎల్తున్నయ్యి. గెద్దల్లాగ రెక్కలు ఆడించుకుని మనుమల్ని కూడా మోసుకు ఎల్తయ్యుట. ముందుకి మన కొండల్లోకి రెయిలు బండి వస్తున్నదుట. మన దూడలు, మేకలు ఆటి కింద పడితే నచ్చిపోతాయుంట. మా మేన మామగారి ఊరు కించుమండ మీదనించి బచ్చులు కూడా వడుస్తాయుంట" అన్నాడు పండుదొర.

"అయ్య బాబో! ఇళ్ళమీద బచ్చులు పడితే మనుమలో!" అన్నది సొంబారి బిక్కమొకము పెట్టి.

"జయపురం రోడ్డులాగ ఆ ఊరి పక్కన రోడ్డు ఏసేరు. ఆ రోడ్డుమీద నడుస్తయ్యి. నరవారేదు. పకేల మనుములు అడ్డవస్తే ఒక మర తిప్పుతే ఆగిపోద్దంట. పొద్దు కుంగి పోతుంది. లేగి ఇంటికెల్లి ఒక గంపెడు లోట కూరన్న వండుకో. నాయుడు చెయ్యి కాళలేదు అని బత్తెము ఇయ్యలేదు. నేను రోజా వరి బువ్వ తింటున్నాను. పాపము నువ్వు రోజా రొడ్డ కూరలు తిని అలాగ ఉంటున్నావు" అని పండు



వలెపడుచు
చిత్రం — ఎమ్. వెంకట్రావు (అనకాపల్లి)

దొర పశువుల మందను తోలుకుని నాయుడు శాలలో చొరపెట్టాడు.

## 2

ప్రతిరోజా కొండమేక నాయుడు పొడులోని కొర్ర చేను మేసేస్తున్నది. దయానిధి ఒకనాడు జోడునలి తుపాకి బుజాన్ని ఏసుకుని దాని అడు గుల జాడ పెట్టుక్కుంటూ రెండు కొండల మధ్యన పారుతున్న కంకిడి గెడ్డ జోరులోకి, గుబురుగా ఉన్న అడవిలోకి దూసుకు వచ్చాడు.

ఆకుల చాటున గెడ్డనీళ్ళు కలకలలాడం విని తుపాకి గురుపెట్టేడు. పాపం వివస్త్ర అయిన సొంబారి తలమీద గిడుగుతీసి చటాలున శరీరానికి అడ్డంపెట్టుకుని తల దించుకుంది.

నాయుడు తుపాకి కిందపెట్టి, తన తల పాగను సొంబారిమీదకు విసిరి చుట్టుకోమన్నాడు. వెంటనే పాపరాయిమీద దూరంగా ఆరవేసిన ఆమె ముతుకు చీరను లుంగచుట్టి పాపరాయి మీద పెట్టి దానిమీద ఆసీనుడయి సావకాశంగా చుట్టకు అగ్గిపుల్లకొట్టి ముట్టించాడు.

"దంగిడీ! (పడుచున్నది) ఓయబ్బో, నీకు సొంగులావు ఉన్నట్టుందే? బట్ట తీసేసి ఒళ్ళు ఎండపెడుతున్నావు. నిజంగా నీకు గొప్ప అందమే ఉంది. గిల్లితే పాలు కారతయ్యి. బియ్యం పిండిలాటి ఒళ్ళు. ఒక్కమాట చెప్పుతా, ఆలకిస్తావా? అలాగయితే నీ బట్ట నీకిస్తాను. లేపోతే ఊళ్ళోకి పట్టుకుపోతా" అన్నాడు ముఠా నాయుడు దయానిధి.

"అయ్యా! బీదదాన్ని. కలిగిన వార్కి కాళ్ళ నరుక్కి, లేనివార్కి ముడుకులనరుక్కి బట్ట. నాకు వేరే బట్టలేదు. అందుకే గత్తరగా ఉందని బట్ట ఉతికి కట్టుకోటానికి ఈ మనుమలు రాని జాబులోకి వచ్చేను" అన్నది లజ్జావతి సొంబారి.

"ఏమి? గుడ్డపాతలు కొనలేని పండుదొరతో ఏ సుకంకోసం పెళ్ళాడావు? నువ్వు 'ఊ' అంటే రేపే అరుకు సంతలో మూడు చీరలు కొంటాను. నేనా పైజాతివాడిని కాను. ముఠా అంతా నాపేరు చెప్తే అడలెక్కిపోతారు. వయసువున్న దంగిడి. వంటరిగ దొరికేవు. ఇక్కడ నువ్వు నేను తప్ప నరనారాయణులు ఎవ్వరూ లేరు. ఏమంటావు? యాటకి లెగిసిన యాల మంచిది. మంచి యాట పారింది. ఏదే అల్పం" అన్నాడు కోరమీసంమీద చెయ్యివేసి దయకు నిధివంటి దయానిధి.

"బాబూ, నువ్వు నా తండ్రివంటివాడివి. నాకన్న పెద్దలయిన కూతుళ్ళు ఉన్నారు నీకు. పొరపాటున నన్ను బట్ట లేకుండా చూసేవు. పోనీలే. తండ్రి కూతురును చిన్నప్పుడు పాకి నీళ్ళపోసి బట్టలు కట్టేస్తుంలేదూ! నా బట్ట నాకు ఇచ్చెయ్యి" అన్నది అబల.

ఎంత ప్రబతిమాలినా వినక మొండిపట్టు మీదే ఉన్నాడు ముఠా నాయుడు.

సొంబారి ఉగ్రరూపం దాల్చి ఒక నల్ల జినప

నాయి చేతబట్టి, "ఇదిగో, నీ బుర్ర బద్దలు గొడతాను. నా దగ్గరికి రాలేవు. నన్ను నీ తుపాకితో చంపి, తరవాత నేలకి పడిపోయిన శవాన్ని కుళ్లి పోటానికి సిద్ధంగా ఉన్న మాంసం ముద్దకు నీవు ఆసపడాలి గాని, జీవితో ఉన్న కట్టె నీకు దక్కదు" అన్నది ఆవేశంతో.

కొంతతడవు ఆలోచించి, "కూతురా! ఏదో కళ్లు పొరలు కప్పి అన్నాను. నన్ను చమించి ఈ గొడవ ఎక్కడా చెప్పనను" అన్నాడు చెమట పట్టిన నాయిడు.

"అలాగే కాని, ఇంకా ఇక్కడ ఉంటే, నన్ను అల్లరిపెడితే తప్పక నాయిరాలుతో చెప్పుతాను" అన్నది సాంబారి.

మళ్లీ నాయిడు తుపాకి చేతబట్టి బాగా ఆలోచించాడు. 'దీన్ని చంపేసి గెడ్డలో తోసేస్తే పీడ వదిలిపోతది. కాని తుపాకి ఏటు విని గ్రామస్థులు వస్తారు. నేను జైలుపాలు. కాదు. దీన్ని పేణంతో వదిలితే ఎప్పుడైనా దొరికించక పోతానా?' బుర్రవంకించి మెల్లగా కాళ్లకు బుద్ధి చెప్పాడు.

ఎత్తుకు పైఎత్తువేసి చదరంగం పావులు నడిపి ఆటకట్టించెడివారే నాయిళ్ళు, దివానులు, మంత్రులు, రాజకీయవాదులు కాగలరు. అందుకే అట్టివారికి పెద్దరికం అంటుగట్టటం. అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు. ఈ కోవకు చెందిన దయానిధి అచటినుంచి ఊరిలోనికి వచ్చి, ఒక కొటియజాతి ఆడుది హద్దుదాటిన దని నేరం మోపి చదరులో పంచాయతీ తీర్పుకు కూర్చున్నాడు.

సాంబారి తీరికగా బొడ్డపళ్ళు ఏరుకుని, గెడ్డలో నాలుగు, ఎండ్రకాయలు దొరికించుకొని, వంటకు నాలుగు చితుకులు, దొన్నె కొరకు నాలుగు అడ్డాకులు పట్టుకుని, ఉదికిన నేరేడు పండు చీర ధరించి తొణకని కుండవలె నిర్మల వాతావరణంలో పొదలను దాటుతూ, సెపరాళ్ళు ఎక్కుతూ, అడ్డుగా ఉన్న డొంకలు తప్పించుకొంటూ, నేరేడుపళ్ళు ఏరుకొంటూ, జరిగిన సంఘటనను నెమరు వేసుకొంటూ ఇంటికిచేరి, చల్లని చోడిఅంబలి తాగి, మేనుమరచి నిద్ర పోయింది.

ఇంతలో పండుదొర నాయిడు ఇంటిలో వరిబువ్వ, కుందేలు మాంసంతో తిన్నప్పటికీ, భార్య మిగిల్చే చల్లని అంబలికోసం వచ్చాడు.

ఆమె లేచింది. అంబలి ఇచ్చి తను తెచ్చిన ఎండ్రకాయలు రెండు కాల్చి నంజకముపెట్టింది. ఆప్యాయతతో తిన్నాడు. అలుపు తీర్చాడు.

కాని సాంబారి జరిగిన సంఘటన పండు దొరతో చెప్పలేదు. అతని చుట్ట తీసుకుని, రెండు బుక్కలు తాగి తిరిగి ఇచ్చివేసింది.

## 3

శివరాత్రి జాగారాలకు గ్రామస్థులూ, దయానిధి కుటుంబంవారూ యావన్మందీ బొర్రా తీర్థానికి వెళ్లారు. ఇంటివద్ద అల్లుడు సీతారాము, పండుదొర కావలా ఉన్నారు. కాపు చేయకపోతే గ్రామస్థులు లేని అదనుచూచి, పరిసర గ్రామస్థులూ, సరిహద్దు అవలి దొంగలూ దోపిడీలు చేసి పశువులను, వంటగింజలను, వ్యవసాయ పనిముట్లను దొంగిలించుకుపోతారు.

రెండు దినాల తరువాత సీతారాము పశువులు కొనడానికి కాశీపట్నం సంతకు వెళ్లుతూ మామను డబ్బు అడిగాడు. నాయిడు పందుకాపెట్టెవద్దకు వెళ్లి తిరిగివచ్చి కోపంతో చిందులు తొక్కుతూ, "నాయనా, సీతారామూ, పెట్టెలోని 300 రూపాయలు లేవు. దొంగ దోపిడీ అయ్యి ఉంటది. తాళం విరక్కొట్టేరు. నువ్వు సంతకు వెళ్లవద్దు. అరకు పోలీసు స్టేషనుకు రిపోర్టుకు వెళ్ళు" అని పంపాడు.

ఆ మధ్యాహ్నమే హుటాహుటిని నలుగురు పోలీసు జమానులు వచ్చారు. ఊరిలోని రైతులు, ఆడువారు, పిల్లా, పీతా ఎక్కడికీ వెళ్లకూడదని హుకుం జారీచేశారు. రైతులు గుండెలు చేత బట్టుకుని వంటలు మానివేసి ఎవరి నెత్తిన పడుతుందో అని బెంగతో ఉన్నారు. అందరూ గ్రామచదరువద్ద హాజరయ్యారు.

ఎండలో అలసి వచ్చిన జమానులను నాయిడు మంచం వాల్చి కూర్చుండబెట్టి, వంటలుచేయించి, ఒక పెద్ద కోడిపుంజును కోసి సుష్టుగా భోజనాలు పెట్టించాడు.

పాపం వారు భోజనాయాసం తీర్చుకోవడానికి కొంత తడవు శయనించి, లేచి సోదా మొదలు పెట్టారు. నాయిడువద్ద వాఙ్మూలం తీసుకున్నారు.

అందులో కొన్నిపేర్లు సూచించాడు నాయిడు. ఇదివరలో తాగిన వేరమ్మడు జామిను ఒకడు. ఊరిలోకెల్లా తల బిరుసు సమాధానము చెప్పే భీమన్న ఒకడు. ఇదివరలో పోలీసు స్టేషనుకు పెట్టే కర్రలు మోత ఎగగొట్టిన శుక్ర ఒకడు. గ్రామంలోని మోతుబరి రైతును, ముఠాదారుతో ఒకసారి దెబ్బలాటకు దిగిన రామన్న ఒకడు. ఇంటికి కావలా ఉన్న పండుదొర ఒకడు.

వరుసను జమానులు మళ్ళ ఇళ్ళ సొయ్యాలు అరుగులు, గోడలు తవ్వించి ధ్వంసంచేసి, వారిని కొడుతూ, తిడుతూ, నానావిధాలుగా అల్లరి పెట్టారు. కడకు పండుదొర కాపురమున్న కొల మూరుకింద మన్నులో పాతిన 300 రూపాయలు ఇమ్ము బిళ్లలు దొరికినవి.

పండుదొరకు బేడీలు వేశారు. ఊరిలోని గిరిజనులందరు గుమిగూడారు. ముక్కుమీద వేలేసుకున్నారు. "తిన్నఇంటికి వాసాలు లెక్కపెట్టే వెధవ" అన్నారు ఒకరు. "మారాజులాంటి భోజనంలో మట్టి పోసుకున్నాడు. ఇక తింటాడు జైలులో ఈగల గంజి" అన్నది ఒక్కతె. "చెట్టుచెడేకాలానికి కుక్కమూతి పిందెలు, వక్రబుద్ధులు" అన్నాడు ఒకడు. "ఇదంతా ఆ ఎర్రటి తిప్పులాడి పెళ్లామే చేసింది. పాపం ఏమీ ఎరుగని పక్షిని కట్టే తీసుకుపోతున్నారు" అన్నారు కొందరు కురూపులు.



అచ్చెరువు
చిత్రం—కదార్ల శేషయ్య (మిర్యాలగూడ)

ముఠానాయిడు, సలానివాడు, బారికివాడు, ఒక పోలీసు హెడ్డు, ఊరిలోని ఒక రైతు కేసు రుజావుచేశారు. విచారణ పాడేరు మేజిస్ట్రేటు కోర్టులో జరుగుతుందని తెలిపారు.

మరునాడు ఉదయం బస్సులో అరకునుండి ముద్దాయిని తీసుకు వెళ్ళుతున్నారు. సాక్షులు రెండవ బస్సులో వెళ్ళుతారు. ఎక్కడన్నా రెండు డబ్బులు యాపకించి బయలుదేరుతారు. ఎందుకంటే ఏడాదికి ఒక శివరాత్రి. ఎట్టకాలానికి కొండలను వదిలి పట్టణాలకు వెళ్లటం, తిరుగు ప్రయాణంలో ఇసాపట్నంలో బయిస్కోపులు చూద్దామని.

బిక్క చచ్చిపోయిన మొకంతో బస్సు ఎక్కాడు పండు దొర. ఇదివర కెన్నడూ శుంకరమెట్ట దాటి అవతలికి వెళ్లలేదు. అదీ కాలినడకను. బస్సు జన్మలో ఎక్కలేదు.

బస్సులోని కండక్టరు బెల్లు కొట్టాడు. బయలుదేరింది బస్సు. విరబోసిన జుత్తుతో బండి కడ్డంగాపడి నెత్తి కొట్టుకొంటూ గొల్లుమని ఏడుస్తున్నది సాంబారి.

కలిసి ఉంటేనే జంట. కాస్త కాలుజారి విడిపోతే విలాపం తప్ప, ప్రతిఫలం శూన్యం.

నాయిడును సాగనంపడానికి వచ్చిన చిన్న నాయిరాలు సాయితబుడ్డి సాంబారిని లేవనెత్తింది. ప్రక్కకులాగి ఓదార్చి "నీకేమీ కొదువ లేదు. పండు వచ్చేవర్కు నీకు తిండికి ఏలోటు లేకను నావంతు బత్యం ఇస్తాను" అన్నది సమవయస్కురాలు, దయామయి అయిన దయానిధి రెండవ భార్య.

నాలుగవనాడు నాయిడు వచ్చి సాంబారిని పిలిచి ఇకనైనా ప్రపంచానికి లొంగి తిరగమని చెప్పాడు. "నీ బంగారు మొగుడు దొంగ ముండా కొడుక్కి ఆరుమాసాలు కైదు ఏసేరు. ఇపా



'కుమ్మరవాని సారెపై!' ఫోటో—డేవిడ్ క్రిస్టఫర్ (అర్గపూర్)

రించకు. తప్పుచేసింది ఆడు. నువ్వు నీళ్ళ, పాలు, కర్రలు, కంప తెస్తే శాలలోని పేడ ఎత్తి ఏదో ఒకపని చేస్తూ కడుపునిండా తిని, సరదాగా ఉండు. నాయుడు ఇంటిలో నల్లటి బట్టలు కట్టకూడదు. రేపు అరుకు సంతనించి మూడు చీరలు తెప్పిస్తాను" అన్నాడు.

## 4

అది చైత్రమాసం. గాదెలనిండా తిలువా ఉన్నవి. పంటలు బాగా పండినవి. కూలి గింజ ప్రజ, రైతులు ఆనందంతో ఉండే నెల. ఆ నెలలోనే మీటింగు పండుగ.

ఒకప్రక్క తుడుములు, డప్పులు, కొమ్ములు, డక్కీలు కొడుతున్నారు. గ్రామంలోని ఆడు, మొగ వివక్ష లేకుండా ఒకరి చేతులు ఒకరు, ఒకరి నడుములు ఒకరు పట్టి కాళ్లకు గజ్జెలు కట్టి వలయాకారంగా తిరుగుతూ, అరియో, యో, యో, కోయి అని కేకలు పెడుతూ ఒళ్ళు మరిచి దిమిస ఆట ఆడుతున్నారు.

వలసల నాయిళ్ళు అంతా ముఠా నాయుడు

# మొనొసుగొత్తి...

ఇంట బసవేసినారు. ఇంటింట మడ్డి కల్లు వండారు. కోళ్ళు కొందరు, మేకలు కొందరు, తినేవారు పందులు కొందరు, కోయజాతి ప్రజలు గొడ్లను చంపుతున్నారు. అందరూ వరిబువ్వే వండుతున్నారు.

తాగినంతమడ్డి, దానితో మాంసం. తిన్నంత వరి అన్నం, అందులో పప్పు—ఇవే గిరిజనుల పండుగ. ఒళ్లుమరచి, కైపెక్కి బాజాలు బజంత్రీలు కొడుతూ, ఆడువారికి మగవారు, మగవారికి ఆడువారు రంగునీళ్ళు కొడుతున్నారు. చెట్లకు డోలీలు కట్టి ఆడువారు ఊగుతున్నారు. మగవారు ఎక్కడా ఊరిలో కూర్చో కూడదు. అలా కూర్చుంటే వారికి ఆడువారందరూ పేడనీళ్ళు చల్లి కొండకు వేటకు తగిలేస్తారు. ఇంకా చేతికి దొరికితే వేటకు వెళ్లడానికి బద్ధకిస్తాడు అని నేరంమోపి త్రాళ్లతో కట్టి చదరుకు తీసుకువెళ్లి ఆడువారే పంచాయితీ జరిపి అతనికి తప్పుకొంటారు. జుల్మానా ఇస్తానని ఒప్పుకుంటే వదిలివేస్తారు.

ఆ పండుగ గడువు పదిదినాలూ ఏ పనీ చేయకూడదు. కొండనుంచి కర్రలు తేకూడదు. బట్టలు ఉతకరాదు. పిండి విసరకూడదు. ఆడువారు పాటలు పాడుతూ పూరికి, మగవారు తప్పక వేటలకు తిరగాలి.

విచారంతో ఉన్న సాంబారిని కొంతమంది ఆడువారు పిలుచుకువెళ్లి ఇంటింటికి మడ్డి కల్లు ఇచ్చారు. ఎవరింటిలో తాగనంటే వాళ్ళ విష్కారం వేస్తారు. పండుగకు కొంచెమన్నా తిని తీరాలి. చిన్న నాయిరాలు కూడా పండుగకు సాంబారికి చీరకొన్నది. "అయ్యో, పాపం! మన లాటి ఆడుది" అని ఆ రోజు తాగినంత మడ్డి కల్లు ఇచ్చింది. బాగా మత్తెక్కిపోయింది. చిన్న ఇంటిదగ్గర ఒళ్ళుమరిచి పడిపోయిందిసాంబారి.

వలస నాయిళ్ళు చుట్టుగా, ముఠానాయుడు మధ్యన కూర్చున్నారు. పండిన మేకమాంసం కుండ్రాలు అందరూ పంచుకున్నారు. ఒకరు కల్లు పంచేపురి అందిస్తున్నారు. వరుసల వారీగా ఎక్కువ తక్కువలేకను ఆ కల్లుపురి తిప్పాలి. అది వారి నియమం. అందులో తేడాలు వస్తే దేవుడు వారిని దండిస్తాడని భయం.

ఉదయంనుంచి మధ్యాహ్నంవరకు ఈవిధంగా తాగిన పెద్ద మనుష్యులు మతులు తప్పి, మతులు జారి ఎక్కడవారు అక్కడే దొర్లిగిలిపోతున్నారు.

బాగా కైపులో ఉన్న దయానిధి వలస నాయిళ్లతో "ఆరు నెలలుగా నా కూడు తింటున్నపిల్ల, స్వజాతిది, సాంబారిని నా మూడో భార్యగా చేసుకుంటాను. అందుకుగాను వలస పెద్దలకు కులభోజి ఆనవాయి ప్రకారం ఒక డబ్బా సారా, ఐదు కుంచాల బియ్యం, ఉప్పు, వర్రకాయలు, నూని, ఒక మేకపోతు ఇస్తాను. తరువాత తన భర్త వస్తే మగవారి తగవులో ఎంత తీర్మానం అయితే అంత డబ్బు కడతాను" అన్నాడు.

సై అంటే సై అన్నారు వలస నాయిళ్ళు. అన్న ప్రకారం ఇచ్చాడు దయానిధి. అంతా పండుకు తినేశారు. పిల్లను ఒప్పచెప్పడానికి చిన్న ఇంటికి వెళ్లారు పెద్దలు. సాంబారి మైకంలో ఉన్నది.

అంతా చూశారు. "పిల్ల నీ ఇంటనే ఉన్నది. ఇక నీ హక్కు. నువ్వు ముఠా పెద్ద. నీకు అడ్డు చెప్పేవారులేరు" అని వలస నాయిళ్ళు వెనక్కు వచ్చారు.

త్రాగుడు మైకంలో ఉన్న దయానిధికి అర్ధ నగ్నంగా పడి ఉన్న సాంబారి దేవలోకం నుంచి అప్పుడే భూమికి విసరివేయబడిన చెంచు లక్ష్మివలె కానవచ్చింది. ఇక నేనే నరసింహుడను అనుకున్నాడు. వంగి ఆమె చేతిని పట్టబోయాడు. అంతలో చిన్న నాయిరాలు సాయితబుడ్డి వచ్చి తూలుతూ ఉన్న నాయుడిని ధాన్యం గదిలోకి తోసి తలుపు గొళ్లెం పెట్టింది. సాంబారిని

కూడా గదిలోకి చేర్చింది.

వలస నాయిళ్ళు ఇష్టానుసారంగా ఆడు తున్నారు. సాయితబుడ్డి వారి మధ్యకు వచ్చి "పిల్ల అంగీకారం లేకుండా నాయిడుకు మూడో నాయిరాలును అంటగట్టేరు. అది చెల్లదు. పూర్వపు పంధా మానండి. ఉభయుల ఇష్టమయి తేనే పెళ్ళికాని, ఒక్కరి ఇష్టం చెల్లదు" అని ఆడుపులివలె గర్జించింది.

నాయిడు పెద్ద భార్య సీతమ్మ అమాయకు రాలు. ఇంటిలో వచ్చేపోయేవారికి వంటా వార్పూ తప్ప ఇతర వ్యవహారాలు ఆమెకు అక్కరలేదు.

# 5

ప్రక్క ముఠాలో దిగువనుంచి వచ్చిన వడ్రంగి తలుపులు దారబందాలు చాలా తమాషాగా చేస్తున్నాడు. గిరిజనులు చేసే పనికన్న వేయిరెట్లు నున్నితంగా చేస్తున్నాడు. చుట్టు పక్కల ముఠాల పని అంతా అతనికే వస్తున్నది.

ఒకనాడు చిన్న నాయిరాలు, సాంబారి సందుకా పెట్టెలు, పూజలు బల్లలు చేయించడానికి వడ్రంగి వద్దకు వెళ్ళారు. వడ్రంగి వానిని చూడ గానే సాంబారి బావురుమని ఏడ్చింది.

వడ్రంగి సాంబారిని ఓదార్చి, "అన్నీ మన మేలుకే కాని, కీడుకు ఏదిరాదు. సొమ్ము ఎవరు దొంగిలించివాగాని మనకు ఆరుమాసాలు ఎడ బాటు జరిగింది. కాని యావజ్జీవితం ఇక విడము" అని అన్నాడు.

"నేను జైలులో ఈ కర్రల పని నేర్చు కున్నాను. మనకు ఇక గొర్తి అవసరంలేదు. వారి డబ్బు తీసుకెళ్ళి రేపు చెల్లగడదాము. మన వూరు రావటానికి మొకంచెల్లక, ఎప్పటికన్నా నువ్వు కనపడతావని, ఎవ్వరినీ నీ గురించి అడుగకుండా ఇన్నాళ్ళూ ఇలాగ ఉన్నాను" అన్నాడు పండు దొర.

మరునాడు నాయిడు డబ్బు చెల్లగట్టారు. ఇద్దరూ చిన్న నాయిరాలుకు, పెద్ద నాయి రాలుకు దణ్ణంపెట్టి కొలువు వదిలి వెళ్ళారు.

ఇరవయ్యి రోజులలో కొండసానువులలో పోడు నరికి వ్యవసాయం మొదలుపెట్టారు. అక్కడే ఇల్లు కట్టుకున్నారు.

మామిడిపిండి (టెంకలలోని జీడి) రొట్టెలు తేనెలో ముంచుకు తింటూ, కొండ అంచులో ఒక రాతిమీద కూర్చుని సాంబారి "ఎన్నో ఈగల బాధ పడితేగాని తియ్యని తేనె దొరకదు. ఎంతో కష్టాలుపడితేగాని సుకం దొరకదు" అంటూ ఆనాడు నాయిడు బారినుండి కంకిడి గెడ్డ జోరులో తప్పించుకున్న సంఘటన మామకు చెప్పింది.

"మరి తే నాకు చెప్పలేదేమి?"

"అప్పుడు నీకు చెప్పినా లాభంలేదు. నీ యజమానిని నీవు ఏమని అడుగుతావు? ఇప్పు డైతే పరవాలేదు. ఎంతయినా నా తాత మనుమ



శ్రామికులు

ఫోటో—ప్రకాశక్ మహాదిక్ (బొంబాయి-28)

రాలు ననిపించుకుని, మన దొరల తెగువచూపించి రాయితో చంపేస్తానని భయపెట్టేను."

"అలాగ చెప్పు. అయితే తరవాత జరిగిం దంతా దాని అక్కసు తీర్చుకుంటానికి అన్న మాట."

"ఆ! చిన్న నాయిరాలు చెప్పింది నాకు. ఆళ్ళ అల్లుడే ఆ డబ్బుతెచ్చిమన గోలికాసి పాతి, నీమీద పెట్టేరు. పాపం! చిన్న నాయిరాలు ఎంత ఉపకారం చేసింది మనకు! ఆ మూర్ఖుడు నన్ను పెళ్ళి చేసుకుంటానని పెద్దలకు భోజి ఇచ్చేడు. నాయిరాలు పులిలాగ అడ్డువచ్చింది."

"ఆహా! ఈ కొండకు నేనురాజు, నువ్వు రాణివి. కొండ లోయలోనున్న సుకాలు కోటిదేశాలు ఎల్లినా దొరకవు."

"మన ఇల్లు నిలబెట్టిన చిన్న నాయిరాలుకు ఏటి ఇద్దాము?" అన్నది సాంబారి.

"ఏమిచ్చినా ఆరికి అక్కరలేదు. ఆరికి బంగారం, ఎండి, పంటలన్నీ ఉన్నయ్యి. ఆమెకు మన ఇద్దరిమీదా పేమే! అందుకని, అందుకని, అందుకని మనిద్దరి మధ్యవర్తి మరి ఆరుమాసాల్లో ఎలుస్తున్నాడు."

అనగానే సాంబారి సంభ్రమభరితురాలై "అవునవును. నాతో అనేది, అన్నీ ఉన్నయ్యి కాని, నా కడుపున కాయిలేదు అని. ఆ లోటు తీరుద్దాము. ఆడపిల్ల అయితే ఇయ్యను" అంది.

"అదికాదే. మగరాజా ఎలుస్తాడే. వాణ్ణి సాయితబుడ్డి అమ్మకు ఇచ్చి మన ఋణం తీర్చుకుందాము."

"అదినరేగాని అడ్డకాయలు ఏరుకురావూ, మామా!"

"రోజా కొక కోరిక కోరకపోతే బేగి కవెయ్య కూడదూ?"

"ఇప్పుడే ఉండాస్తే మూత్రపాసి లేదు ఇక్కడ."

"మంత్రము, సాని ఎందుకు? భగవంతుడు మనపైన ఉంటేనరే. సకల జీవరాసులు, అడవి జంతువులు—వాటికి ఎవరు రక్ష?" ★